– పిల్లలూ, వూరిచుట్టూ ఆగ్రహంతో సెగలు పొగలూ కక్కుతున్నాయా అన్నట్లున్న కొండలు, నేలతల్లి దీర్ఘ నిశ్వాసంలా వేడిగాలి వడగాలి – నేలతల్లి కడుపు పగిలింది. బద్దలయిన భూమి, పగిలిన గోడలు, పగిలిపోతున్న ఇళ్ళ కప్పులు – కూలిపోతున్న బ్రతుకులు కాలిపోతున్న బ్రతుకులు – చల్లార్చటానికి నీళ్ళేవీ – కన్నీరింకిన నీళ్ళులేని కళ్ళు, గుడ్డ పేలికలు, పందుల పెంటలు, చెత్తాచెదారం, ఎర్రటి యిసుక, నల్లగా మండుతున్న మట్టి దిబ్బలు, ఎర్రెర్రగా సూర్యుడు, ఆకాశంలో వర్షించని మేఘాలు, భుగభుగలు – పగిలిన పగుళ్ళు పగబట్టిన రాత్రిళ్ళూ – కారుహారన్లు – బళ్ల కిరకిరలు కాళ్ళ అడుగుల చప్పుళ్ళు – కేకలు – ఈలలు – అరుపులు – పారాహుషార్ కేకలు – రోడ్లమీద చల్లారిన సంసారాలు – పాత గుడ్డల మూటలు – చింకి చేటలు – కుండలు – కుక్కి మంచాలు తడికలు – వెదుళ్ళు వాసాలు – నడుస్తున్న జీవచ్ఛవాలు –సోడాబుడ్లకీచు కీచు చప్పుళ్ళు – సైకిళ్ళు – రిక్షాలు – కార్లు – వీధుల్లో కుక్కలు, టెలిఫోను –టైపు మిషన్లు – హడావిడి హడావిడి, భగవంతుడికి చావు బాజాలు వాయిస్తున్నట్లుంది విజయవాడ. ఒరే, బాబూ, నాయనా, ఆపద్బాంధవా, ఒక్క వర్షం వూరంతా తడిసి పోయేలాగు, కాలిన కొంపలు, కాలినట్లున్న మనుషులు, కాలిపోయిన సంసారాలు చల్లబడేందుకు ఒక్కవర్షం. ఒక్కపూట, కురిపించు, కురిపించు, నేలతల్లి దుఃఖం తీరేలా ఒకటే వర్షం కురిపించు తండ్రీ కురిపించు. పసిపిల్లలు, పిల్లల తల్లులు, మగవాళ్ళు, కానివాళ్ళు అంతా సంతోషించేలా ఒకటే వాన. కవులు వర్ణించినట్లు మంచి గంధం పూతలు పెట్టుకుని కూర్చుందుకు వీల్లేకుండా వుందిరా నాయనా. పంచాంగాల్ని పిండినా ఒక్క బొట్టు నీరు రాలటంలేదు – ఎన్ని సుప్రభాతాలు, ప్రార్థనలు, భజనలు చేసినా మేం కార్చే కన్నీళ్ళే తప్ప నువ్వు కురిపించే చన్నీళ్ళు లేవు. ఒక్క వర్షం కురిస్తే – ఒక్క హరివిల్లు విరిస్తే – చాల్రాబాబూ నాయనా తండ్రీ, బెజవాడ చేసిన పాపాలన్నీ కొట్టుకు పోయేలాటి వర్షం ఒక్కటంటే ఒక్కటి భూమ్యాకాశాలను గొలుసుల్తో బంధించినట్లు కురిస్తే చాలు చాలు. మరింకేమీ నిన్నడిగేదిలేదు. జనమేజయుని సర్పయాగంలా వుంది. హనుమంతుడు కాల్చిన లంకలా వుంది. మండుతున్న కొరకంచులా వుంది. శవం వెళ్ళిన కొంపలా, ఆరని కుంపటిలా, మహాశ్మశానంలా వున్న విజయవాడమీద కరుణించు, కరుణించూ కైలాస వాసా శంభో...కరుణించూ కరుణించూ.

(తిరిపెమున కిద్దరాండ్రా, పరమేశా గంగ విడుము పార్వతి చాలున్–)

# వరమ్మ మొగుడు

"లెండు – ప్రపంచ భార్యలారా ఏకం కండు" అని మావారు వేళాకోళం చేస్తూ వుండేవారు ఢిల్లీలో వున్నప్పుడు మా లేడీస్ అంతా ఒకచోట చేరి పిండిరుబ్బింగు, హస్కు, ఒడియాలు. అప్పడాలు, పచ్చళ్ళు పెట్టడం యిత్యాది విషయాలపై సమావేశాలు జరిపినప్పుడు...కొత్త

చోటమహానగరాల్లో భర్తల ఫ్రెండ్ల తాలూకు భార్యామణులే ఇతర మణులకు ఫ్రెండ్లవుతారు కాని మరొకరు కాదు గదా ఇరుగూ పొరుగూ తప్ప. వరమ్మగారు నాకిలాంటి ఫ్రెండు. క్లోజప్పులో ఆవిడ కేర్‌లెస్‌గానూ లాంగ్‌షాట్‌లో వయ్యారంగానూ వుండేది. వాళ్లాయన "వరం-వరం" అని కంగారుగా ఆవిడ్ని పిలుస్తూంటే "వరలక్ష్మి" అని పిలవరాదా అని ఆవిడ కించిత్తు కోపం చేసుకుంటూ వుండేది ఆ చాదస్తపు పురుషుడి మీద. ఆయన్ని సీతారామమూర్తి గారని అంతా అనేవారు.

వరమ్మగారు అట్టే నీట్‌గా టీకుటాగ్గా కనిపించక పోయినా ఆవిడ కలుగోలు తనం ఆవిడ చిరునవ్వూ మెస్మరైజ్ చేసి ఆవిడలోపాలను కప్పి బుచ్చేవి. సీతారామమూర్తిగారు ఆవిడకు తగిన భర్త కాదని ఓ పదినిముషాలు పలకరిస్తే తెలిసిపోతుంది. కాని ఎవరెవరికితగిన భర్త భార్య అవునో కాదో చర్చించటం మన పని కాదుగదా! వరమ్మగారూ ఆవిడ భర్త ఎవరింటికేనా పెత్తనానికి బయల్దేరారంటే - ఆయన రోడ్డుమీద చేసే గొడవకి ఆవిడకు తల కొట్టేసినట్లుండేది. చిన్న పిల్లను గదమాయించినట్లు గదమాయించేవాడు. "వరమ్మా-ఇటూ-ఇటూ- తొక్కుతావు. రోడ్డుమీద పిల్లడు జాగ్రత్త - జారిపోతాడు - గబగబనడూ-" అంటూ పెద్దకేకలు పెడుతూ ఆవిడ్ని సతాయించేవాడు. ఆయన ఆర్భాటం చూసి ఆవిడ ముఖం ఎర్రగా ఉక్కురోషంతో కందిపోయేది.

"మాస్టారూ-మా ఫిమేల్సుని రోడ్డుమీద నడిచేప్పుడు నేను అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను. ఏ బండో, స్కూటరో, కారో, గుద్దేస్తే మన పని ఏంగాను - మన ఫిమేల్సుకి రోడ్డుమీద నడవటం తెలీదండీ. మన జాగ్రత్తలో మనం వుండాలి." అనిచింకిలెక్చర్లిచ్చేవాడు. పచ్చగా సన్నగా, నాజూగ్గావున్నా ఆవిడ్ని పల్లెటూరు బైతును చూసినట్లు చూసేవాడు. లాంతరు స్తంభం దగ్గరకాని, రోడ్డు మొగలోకాని, తూము మీద కూర్చోపెట్టికాని, ఇంటి గుమ్మంలో కాని నిలబెట్టి మాష్టారు ఇది వినండి" అని అంటూ గంటల తరబడి కాళ్ళు పీక్కు పోతున్నా వదలకుండా హస్కుకొట్టేవాడు. మూర్తిగారి చింకి లెక్చర్లని ఆయన మాట్లాడినదంతా ఓ పుస్తకం వేస్తే అటువంటి కేరక్టరును డిస్కవర్ చేసినందుకు ఆంధ్రదేశమంతా మా వారికి రుణపడిపోయి వుండును.

సిగరెట్ కాల్చడు, పాన్ వేసుకోడు, సైకిలు కాల్నడక తప్ప చచ్చినా బస్సెక్కడు. తప్పకపోతే ఫామిలీని బస్సెక్కించి తను సైకిలు మీద ఫాలో అవుతాడు. కొన్ని మైళ్ళు వెనకబడినాసరే లెక్కచేయకుండా చాలా జాగ్రత్త - పొదుపు-వీట్ని మించిన చాదస్తం... సెలవు రోజుల్లో మా ఇంట్లో ఫ్రెండ్సంతా ఆయన అడ్వెంచర్స్ చెప్పుకొని ఆనందిస్తూండగా "మాష్టారూ" అంటూ ఆయనే వచ్చేవాడు. అంతా నిశ్శబ్దంగా వుండేసరికి మొదట్లో ఆయనకు బోధపడేది కాదు. తరువాత కోపం వచ్చేది.

సీతారామమూర్తి గారికి ఈ విషయం మాట్లాడొచ్చు యిది మాట్లాడకూడదు అని తెలిసేది కాదు. ఆయనకు ప్రమోషన్లు వచ్చేవి కావు. ఇన్‌పేషంటని ఆఫీసులో పేరొచ్చేసింది. తన కళ్ళ

ముందు ఢిల్లీ వచ్చిన వాళ్లంత పెద్ద పెద్ద జాబ్స్‌లోకి వెళ్తుంటే ఈయన మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అంటే అక్కడే అన్నట్లు వుండేవారు. మళ్ళీ యం.ఎ.బి.యల్. చదివానని లా డిగ్రీ వున్న పోస్టుగ్రాడ్యుయేటు వెధవ యుడిసీగా వుండిపోవడవేమిటని గోలపెడుతూ వుండేవాడు. బాస్‌ని సుముఖుడ్ని చేసుకోవడానికి కందిపొడుం, గోంగూర, ఆవకాయ, కొరివికారం యిచ్చి యింటికి భోజనానికి పిలిచి పాత ట్రిక్కులన్నీ ప్రయోగించేవాడు. ఆ వచ్చిన కొత్త బాస్ కూడా "మూర్తిగారు చాదస్తుండండీ" అని ఎక్కడో పుటిక్కిన నోరు జారగానే "చూశారా- మాష్టారూ - ఇది కలియుగం - కంది పొడుం తిన్నాడా"... అని ఏకరువు పెట్టేవాడు ఆయన. వాళ్ళ అబ్బాయి పొట్ట వచ్చిందని కాళ్ళు వాచాయని, వాళ్ళావిడ రాత్రల్లా వేడిచేసి దగ్గు తోందనీ, తనకు లూజ్ మోషన్సు అయ్యాయని, టైలరు కుట్టిన రవిక ఇరుగ్గా వుందని వాళ్ళావిడ అందనీ సబ్బుబిళ్ళ బాత్రూంలోంచి మాయమైందనీ, ఇంటివాడి గెస్టు వాళ్ళ మిసెస్‌కేసి క్రూరంగా చూస్తున్నాడనీ, సైకిలు ముందు చక్రంలో గాలి తగ్గిపోతూ వుంటుందని దోమలమీద రాసిన వ్యాసం వాళ్లావిడ మెచ్చుకుందనీ, వాళ్ళ బాస్ ఆ వ్యాసం చదివి నవ్వలేదని హిందీరాదని, ఆవిడ్ని సైకిలు వెనక కూర్చోపెట్టుకుని తొక్కుతూ పేవ్ మెంట్ మీద పడేసినా ఎక్కడా గీసుకుపోలేదనీ యిలా "చెదారేర్- చీదారేర్" అంతా పోగుచేసి అవతలి వాళ్ళను బోర్ కొట్టేస్తు ఉండేవాడు. ఆయనస్తమానూ తను చాలా ప్రిన్సుపుల్డు మ్యాన్నని సోదాహరణలతోసొంత హస్కుకొడ్తూ వుండేవాడు. "జాగ్రత్తగా వుండాలండీ మనం జాగ్రత్తగా వుండాల్సిందే" అంటూ జాగ్రత్తోపన్యాసాల వర్షం కురిపించేవాడు.

మూర్తిగారు సైకిలు గురించి ఒక కార్టూన్ కథ రాయొచ్చునంటారు ఆయన మిత్రులు. ఇంటికిగాని సైకిలుకిగాని ఆయన తాళం వెయ్యటాన్ని ఒక చార్లీ చాప్లిన్ లాటివాడు మాత్రమే అనుకరించగలడు. పాలవాడికి డబ్బిచ్చాక పదిమాట్లు వాడి దగ్గరకి కెళ్లి "ఇచ్చాన్సుమా - జాగ్రత్త - లెక్కెట్టుకో పద్దెనిమిది రూపాయల పదహారు నయాపైసాలు అనేవాడు. "వెళ్ళవయ్యా" అని ఏక వచనం ప్రయోగించే వరకూ వాడు మర్చిపోతాడేమోనని విసిగించేవాడు.

అంటువంటి మూర్తిగారి వద్ద మావారోసారి బుద్ధి గడ్డితిని పాతిక రూపాయలు చేబదులు తీసుకున్నారు.

"జాగ్రత్తండి మేష్టారూ - పాతిక - ఐదైదు రూపాయల నోట్లు - మర్చి పోకండి. మళ్ళీ ఫస్టు తారిక్కు యిచ్చేస్తారు కదూ - బాబ్బాబు - డబ్బు దగ్గర స్నేహాలు చెడిపోతాయి. ఫస్ట్ తారీక్కు యిచ్చేయండి. పాతిక - ఐదైదు రూపాయల నోట్లు" అని కేకలు పెట్టి అప్పగింతలు పెడుతూంటే మావారికి తల కొట్టేసినట్ల యిందట - ఈ యాగీ చూసి.

ఫస్ట్ తారీకు వారం రోజులుందనగా "మాష్టారూ ఫస్ట్ తారీకు - పాతిక - మర్చిపోకండి" అని జ్ఞాపకం చేస్తూ అందర్లోనూ గుర్తు చేసి "క్షమించండి - జాగ్రత్త కోసం అంటున్నాను" అని చివరకు యిచ్చేశాక - భేష్ మీరందర్లాటి వారు కాదండీ! అన్నమాట ప్రకారం మీలా నిలబడే వారెవరండీ అని మెచ్చుకొంటూ ఓ సర్టిఫికేటు పారేశాడు.

ఆయన దగ్గర చేబదులు తీసుకోవటం ఒక పనిష్మెంట్, ఒక సుదీర్ఘమైన విషాదకరమైన అనుభవం. యాగీ- అల్లరీనూ-వరమ్మగారెలా వేగుతుందో తలుచుకుంటే ఆశ్చర్యం నవ్వూ వస్తాయి. మారుతున్నకాలంతో మారని మర మేకులాటి మనస్తత్వం మూర్తిగారిది. ఆయన చాదస్తం గురించి ఎవరైనా ఒక చమత్కారమైన నవల వ్రాయొచ్చు - వరమ్మ మొగుడూ జిందాబాద్!

# బుడ్డిగ రాధమ్మ కథ

ఆడ కళాసీల మస్తరు చూసినపుడు - "చంప, రాధ, పద్మ" లాటి చక్కటి పేర్లు పెట్టుకుంటారు యిక్కడి ఆడకూలీలు అని తెగ మెచ్చుకునేవారు కొండవాళ్ళ కల్చర్‌కి ముగ్ధులయి మావారు. వెంకమ్మ, పుల్లమ్మ, సుబ్బమ్మ సూరమ్మలాటి మన పేర్లుకంటె చంప, పద్మ, రాధ, మాల - యిలాటి పేర్లు దేవతా స్త్రీల నామావళిలా చదువుకోడంలో ఆనందం వుండదూ? నదుల పేర్లూ నారీమణుల పేర్లూ అందంగా వుండే అరకులో కొన్నాళ్ళు వుండటమనేది మా అదృష్టమని నేననుకుంటాను.

అప్సరసల్నీ, దేవతా స్త్రీలనూ పిలిచినట్లు నదుల్ని అందమైన పేర్లతో పిల్చుకోవటం ముచ్చటగానే వుంటుంది. ఉత్తర మహేంద్ర తనయ, వంశధార, నాగావళి, గోస్తని, శారద, వరహ, తాండవ, చంపావతి ఇవి శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లోని కొన్ని నదుల పేర్లు.

అరకు లోయలోని కొండవాళ్ళ పేర్లు స్త్రీలవి అందంగా వుండటం (ముఖ్యంగా మనవాళ్ళ కంటె మంచి పేర్లు పెట్టుకోవడం) నా కాశ్చర్యం వేసింది. వాళ్ళు బావుంటారు పచ్చగా - చూడ్డానికి కళ్ళకి నిండుగా అమాయకంగా ప్రకృతి సంతానంలా నిర్విచారంగా వుంటారు.

ప్రాజెక్టు పనుల్లో కొండవాళ్ళు ఆడా మగా అంతా కళాసీలుగా చేరే వారు. కళాసీకి రోజుకి రూపాయిన్నర, ఆడ కళాసీకి రూపాయి పావలా యిచ్చేవారు. కంట్రాక్టర్ల దగ్గర కూడా ఆడా మగా కూలీలు వందల కొద్ది పనిచేసేవారు. ఇళ్లు, ఆఫీసు బిల్డింగులు, రైలు స్టేషన్లు ప్లాటుఫారాలు, వంతెనలు కట్టడానికి గవర్మెంటు తరపునా, కాంట్రాక్టర్ల తరపునా 'కూలిజనం' పనిచేస్తూండేవారు. మనుషులు చాలకపోతే చాలా దూరం నుంచి రైళ్ళలో మందల్ని తోలుకొచ్చినట్లు తోలుకొచ్చి పనులు జరిగేచోట పాకలేసి వుంచే వారు. కంట్రాక్టర్లు తెచ్చిన మనుష్యులుపని ఎక్కువ, తిండి తక్కువ, జులుం ఎక్కువ అయి అడవుల్లో రోగాలు పట్టుకుని దిక్కు మొక్కూ లేకుండా నాశన మవుతూండేవారు. విరోచనాలు, కడుపునొప్పి, కలరా, మలేరియా పిలిస్తే పలికేవి. అడవిలో వాగుల్లోని నీళ్ళు తాగితే కొందరికి కీళ్ళ జ్వరాలు పట్టుకునేవి. కుటుంబాలకు కుటుంబాల మనుషులు అల్లానే అనారోగ్యంతో తీసుకుంటూ పనులుచేస్తూ